పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాట

● ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్



7వ వార్డులో వృద్ధురాలికి ఓటు అభ్యర్థిస్తున్న కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు(టౌన్) : దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. మంగళవారం స్థానిక 7వ వార్డు మేదరి వీధిలో కార్పొరేటర్ జుబేర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడప వద్దకు వెళ్లి ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాను గుర్తించాలన్నారు. గతంలో ఖరీదైన, నాణ్యమైన విద్య కొందరికే పరిమితమని, జగనన్న హయాంలో పేదలకు సైతం ఉచితంగా అందుతుదని చెప్పారు. విదేశీ విద్యకు సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సాయం అందజేస్తుందని చెప్పారు. ఇప్పటికే నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. ముస్లింలకు వైఎస్సార్ కల్పించిన 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని భారతీయ జనతా పార్టీ ప్రకటిస్తున్నా ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ మాత్రం ఖండించడం లేదన్నారు. దీనిని బట్టి ముస్లింల రిజర్వేషన్ల రద్దుకు కూటమి పార్టీలు కుట్ర పన్నుతున్నట్లు తెలుస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని చిత్తగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

52వ వార్డు ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరిక...

నగరపాలక సంస్థ పరిధిలోని 52వ వార్డుకు చెందిన ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం స్థానిక నరసింగరావు పేటలోని ఆ పార్టీ నగర కార్యాలయంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య సమక్షంలో 300 కుటుంబాలు పార్టీలో చేరాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రిజ్వాన్, షబ్బీర్, ఖాదర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

చంద్రబాబు మోసకారి

● ఎన్నికల ప్రచారంలో పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబు మోసకారి అని, తన స్వార్థ రాజకీయం కోసం మాయమాటలు చెబుతారని వైఎస్సార్‌సీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 26, 27వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక వాటిని నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించామన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి టీడీపీ,బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాయన్నారు. కూటమి పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో 26, 27వ వార్డుల కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, పల్లె శారద, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వేసవిలో ప్రయాణికులు జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): వేసవి కాలంలో ప్రయాణికులు వడదెబ్బకు గురిగాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి చెప్పారు. మంగళవారం కర్నూలు రైల్వేస్టేషన్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రయాణికులకు వడదెబ్బకు గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రమీలాదేవి మాట్లాడుతూ ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరిగినందు వల్ల ప్రజలు వడదెబ్బకు, డీహైడ్రేషన్‌కు గురిగాకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. తలనొప్పి, తలతిరగడం, నీరసం, జ్వరం, నాలుక ఎండిపోవడం, స్పృహ కోల్పోవడం వడదెబ్బ లక్షణాలని తెలిపారు. వడదెబ్బ సోకకుండా ఉండాలంటే పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉన్న సమయంలో ఎండలో తిరగకుండా ఉండాలన్నారు. పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంగా ఉన్న వారు, గర్భిణిలు మరింత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. రోజుకు కనీసం ఐదు లీటర్ల నీటిని తాగాలని, కొబ్బరినీరు, మజ్జిగ, పళ్ల రసాలు, ఓఆర్ఎస్ ద్రావణం తాగుతూ ఉండా లని సూచించారు. అనంతరం రైల్వే హాస్పిటల్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో హెచ్ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖరరెడ్డి, రైల్వే హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ మణిమాల, హెల్త్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో చదువులో రాణించాలి

● ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హాస్టల్ విద్యార్థినులకు సన్మానం



హెచ్‌డబ్ల్యూఓ బెన్నమ్మను సన్మానిస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థినులు చదువులో మరింత రాణించాలని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల నెంబర్:1 వసతి గృహం సంక్షేమాధికారిణి బెన్నమ్మ కోరారు. ఇటీవల విడుదలైన ఇంటర్‌మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల సన్మాన కార్యక్రమం వారి తల్లిదండ్రుల సమక్షంలో మంగళవారం స్థానిక వసతి గృహంలో జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌డబ్ల్యూఓ మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరంలో ఎంపీ హెచ్‌డబ్ల్యూ గ్రూపులో ఎస్ ఆనందమ్మ 915, కె. అఖిల 913 మార్కులు సాధించారని, ఎనిమిది మంది విద్యార్థినులు వేర్వేరు గ్రూపుల్లో 800కు పైగా మార్కులు సాధించారన్నారు. అలాగే ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 13 మంది విద్యార్థినులు 400 నుంచి 455 మార్కులు తెచ్చుకున్నారన్నారు. భవిష్యత్‌లో డిగ్రీ, పీజీ, ఇతరత్రా కోర్సుల్లో కూడా మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థినులను తమ సొంత పిల్లలుగా భావించి వారి ఉన్నతికి కారణమవుతున్న హెచ్‌డబ్ల్యూఓ బెన్నమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 5 వ తేదీ నుంచి 8 వ తేదీ వరకు నిర్వహించనున్న పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అధికారులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ ఎ. క్యాంపు ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్‌లో ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి పరిశీలించారు. అక్కడ చేపడుతున్న ఏర్పాట్ల గురించి డీఈఈ రవిప్రకాష్ నాయుడును అడిగి తెలుసుకున్నారు. ఈనెల 26 వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నగర పాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీదే విజయం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు(సిటీ): ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయాన్ని అడ్డుకోలేరని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, ఎం.మణిగాంధీ అన్నారు. మంగళవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పూడూరు, పడిదెంపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. నాలుగు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో ఉన్న చంద్రబాబు ఏనాడూ పేదరిక నిర్మూలన, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల గురించి పట్టించుకోలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ప్రభుత్వ సేవలను ఇంటి దగ్గరకే చేర్చేలా ప్రతి గ్రామంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, పేదల సొంతింటి కల సాకారం చేశారన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందించారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారన్నారు. ఇంగ్లీష్ మీడియంతో పాటు డిజిటల్ విద్యను అందిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, కాలువలు, నీటి సమస్యలు పరిష్కారించారని చెప్పారు. ఫ్యాను గుర్తుకు ఓటు చేసి సంక్షేమ పాలనను ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్న కుమార్, వైస్ ఎంపీపీ నెహిమియ, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రశాంత్, ప్రసాద్, వినయ్‌కుమార్‌రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రామాంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీని మరింత వృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత వృద్ధిలోకి తీసుకురావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో అన్ని విభాగాధిపతులు, ప్రొఫెసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల్లో ఆరోగ్యశ్రీ లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేశారని అభినందించారు. ఆరోగ్యశ్రీ కేసులు ట్రస్ట్‌లో తిరస్కరణకు గురిగాకుండా చూసుకోవాలని హెచ్ఓడీలను ఆదేశించారు. ఈ–హాస్పిటల్ అమలు అన్ని విభాగాల్లో బాగా చేస్తున్నారని కితాబునిచ్చారు. అన్ని విభాగాల్లో ఉండే హౌస్‌సర్జన్ల డ్యూటీలపై పర్యవేక్షణ చేయాలని చెప్పారు. వారి డ్యూటీ రోస్టర్, సమయపాలన, విధుల్లో ఉన్నారా లేదా అన్న విషయాలను పర్యవేక్షించాలని సూచించారు. విధులకు రానివారిపై చర్యలు తీసుకోవాలని హెచ్ఓడీలకు ఆదేశించారు. ఆసుపత్రిలో ఏఎంసీ, ఎస్ఐసీయూలలో ఏసీలను అందుబాటులోకి తీసుకొచ్చామని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ఆయా విభాగాల్లో ఎవ్వరికైనా వైద్యపరికరాలు కావాలంటే ఇండెంట్ పెట్టాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు చెప్పారు. అంతకుముందు ఏఎంసీలో అవసరమైన వసతులు, సౌకర్యాలతో పాటు కొత్త ఏసీలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేసినందుకు గాను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డిని చాంబర్‌లో జనరల్ మెడిసిన్ వైద్యులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హెచ్ఓడీలు, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ సీఈఓ శివలీల సస్పెన్షన్

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ శివలీలను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. కేడీసీసీ బ్యాంకులో జనరల్ మేనేజరైన శివలీల సీఈవోగా ఇన్‌చార్జీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందు 40 రోజుల పాటు సెలవుల్లో వెళ్లిన ఆమె ఇటీవల తిరిగి వచ్చారు. కోడ్ అమలులో ఉన్న సమయంలో జిల్లా ఎన్నికల అధికారి అనుమతి లేకుండా ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయం జిల్లా ఎన్నికల యంత్రాంగం దృష్టికి పోవడంతో షోకాజ్ నోటీసు ఇచ్చి 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. సమాదానం ఇచ్చినప్పటికీ సంతృప్తికరంగా లేకపోవడంతో చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శివలీలను ఇన్‌చార్జ్ సీఈవో బాధ్యతల నుంచి తప్పించి ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్‌కు ఆ బాధ్యతలు అప్పగిస్తూ డీసీసీబీ పాలకవర్గం చైర్మన్ విజయమనోహరి చర్యలు తీసుకున్నారు.

విజేతగా తిరిగి రండి

కర్నూలు (టౌన్): ఈనెల 27, 28 తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో నిర్వహించనున్న జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 పోటీలకు ఎంపికైన రాష్ట్ర రగ్బీ జట్టు ప్రతిభ చాటి విజేతగా తిరిగి రావాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య వెల్లడించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలివ్వడమే లక్ష్యం

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందివ్వడమే తమ లక్ష్యమని నూజివీడు సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వెంకటరావు తెలిపారు. మంగళవారం నూజివీడు సీడ్స్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కర్నూలులోని డీవీఆర్ మాన్షన్స్‌లో వజ్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ తమ కంపెనీకి దేశ వ్యాప్తంగా 16 ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, రైతులకు 31 రకాల పంటలకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు అందజేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పత్తి విత్తనోత్పత్తి విభాగం హెడ్ అలగర్‌సామీ, ఏజీఎం ఎస్.నరసింహారెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ దాసు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేవు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులేమి లేవని, ఇందుకోసం ముందస్తుగా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వివరించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలోని పరిస్థితులను సీఎస్‌కు వివరించారు. కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ కల్లా కల్యాణి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి పాల్గొన్నారు.

మహిళ గర్భాశయంలో ఆరు కిలోల కణితి

కర్నూలు(హాస్పిటల్): ఓ మహిళ కడుపులో ఏర్పడిన ఆరు కిలోల కణితిని నగరంలోని అమీలియో హాస్పిటల్ వైద్యులు తొలగించారు. వివరాలను ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ కె.కావ్య వివరించారు. 'స్థానిక జంపాలనగర్‌కు చెందిన పార్వతమ్మ(62) సమీపంలోని హోటల్‌లో కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగించేది. ఆమెకు ఇటీవల తరచూ కడుపునొప్పి వస్తూ ఉండేది. ఇటీవల నొప్పి తీవ్రం కావడంతో గత నెల 27వ తేదీన ఆమె స్థానిక అమీలియో హాస్పిటల్‌కు చికిత్స కోసం వచ్చింది. ఆమెకు స్కానింగ్ చేసి చూడగా ఆమె గర్భసంచి లోపల ఉండే అండాశయంలో 30 సెం.మీ వ్యాసార్ధంలో ఆరు కిలోల కణితి ఉన్నట్లు తేలింది. అదే నెల 29వ తేదీన ఆపరేషన్ నిర్వహించాము. ఐదు రోజుల అనంతరం ఆమెను ఈ నెల 2వ తేదీన డిశ్చార్జ్ చేశాం. ఆమెకు పూర్తిగా ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా నిర్వహించాము' అని తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



హెల్త్ సూపర్‌వైజర్లకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డీసీఓ డా.ఐ శ్రీదేవి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల్లోని (డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు) విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి కోరారు. మంగళవారం స్థానిక సీ క్యాంప్ సెంటర్ సమీపంలోని కార్యాలయంలో 14 మంది హెల్త్ సూపర్‌వైజర్లకు ఆమె ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ గురుకులాల్లోని విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన, పౌష్టికాహారం, ఆహారపు అలవాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీరికి ఆరు వారాల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దిన్నెదేవరపాడు ప్రిన్సిపాల్ అరుణకుమారి, రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర సెక్రెటరీ రామాంజనేయులు, సీనియర్ అధ్యాపకులు ఉమామహేశ్వరప్ప, రిటైర్డు ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ లైన్‌ల మెయింటెనెన్స్ వర్కులు చేపడుతుండటంతో ఈ నెల 24న రేడియో స్టేషన్ ఫీడర్, బాబా బృందావన్ నగర్ ఫీడర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. తులసీ నగర్, పద్మారైస్ మిల్, వీకర్ సెక్షన్ కాలనీ, మల్లారెడ్డి రిచ్‌మండ్ విల్లాస్, గీతాంజలి వెంచర్,రేడియో స్టేషన్, వెంకయ్య నగర్, బాబా బృందావన్ నగర్, గోపీనగర్, నిర్మలానగర్, రాజీవ్ నగర్, టీవీఎస్ షోరూం, యమహా షోరూం ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఓల్డ్ టౌన్ సెక్షన్ పరిధిలోని ఒకటో పోలీస్ స్టేషన్ ఏరియా, రాంబొట్ల దేవాలయం, కుమ్మరి వీధి, ఓల్డ్ టౌన్ ఏరియా, చిత్తారి స్ట్రీట్ ఏరియాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

28న క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 28 వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్–15, అండర్– 19, సీనియర్స్ బాలికల క్రికెట్ జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్ర గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. అండర్–15 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2009 సంవత్సరం సెప్టెంబర్ నెల 1 వ తేదీ నుంచి 2011 సంవత్సరం ఆగస్టు 31 వ తేదీ మధ్యన జన్మించి ఉండాలని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

28న 'మంచం మీద పెళ్లి' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ కన్వీనర్లు సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న తెలిపారు. చిలకలూరి పేట మద్దుకూరి క్రియేషన్స్ వారిచే నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

ఐదో రోజు 6 నామినేషన్లు

కర్నూలు (టౌన్) : కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ వాటిని స్వీకరించారు. టీజీ భరత్ (తెలుగుదేశం పార్టీ) రెండు సెట్లు, టీజీ శిల్పా (తెలుగుదేశం పార్టీ), గౌతం క్రిష్ణ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), షేక్ మాలిక్ బాషా (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), అరుణ్‌కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు.

వచ్చేనెల 1 నుంచి హాకీ సమ్మర్ క్యాంప్

కర్నూలు(టౌన్): వచ్చే నెల 1వ తేదీ నుంచి స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హాకీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు హాకీ కర్నూలు అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99665 65317 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

సీపీఎం అభ్యర్థి ప్రచారం

కర్నూలు(సెంట్రల్): పాణ్యం సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ మంగళవారం కల్లూరులోని షరీన్‌నగర్, గట్టయ్యనగర్,పార్వతీనగర్‌లలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, సీపీఐ బలపరిచిన తనను గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే నీటి సమస్య లేకుండా చేస్తానన్నారు. కా ర్యక్రమంలో నాయకులు జి.రామకృష్ణ, పీఎస్ రాధాకృష్ణ, జి.రామన్న, ఆ నందు బాబు,లింగన్న,నగేష్,యేసు,వర్మ,శంకర్,గురుస్వామి పాల్గొన్నారు.